# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 23 మే, 2024 | పేజీలు : 05


## విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా చూడాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/ కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ పట్టణంలోని మున్సిపాలిటీ సింగం బస్తీలోని ప్రభుత్వ పాఠశాలను ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పరిశీలించి అక్కడ జరుగుతున్న పనుల ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత సమయంలోగా మరమ్మతులు పూర్తిచేయాలని, శిథిలావస్థలో వున్న వంట గదికి మరమ్మతులు చేయాలని తెలిపారు. తాగునీటి సౌకర్యం, విద్యుత్ సదుపాయం, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులను సత్వరమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, మండలాభివృద్ధి అధికారి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల్లో నూరు శాతం పనులు పూర్తికావాలి

### పనుల పురోగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** పాఠశాలల్లో ఎటువంటి లోపాలు లేకుండా విధ్యార్థులకు అన్ని వసతులు, సౌకర్యాలతో కూడిన విద్యను అందించే దిశగా ప్రభుత్వం చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు నూటికి నూరు శాతం పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో విద్యాశాఖ, ఆర్అండ్‌బి , ప్రత్యేకాధికారులతో అమ్మ ఆదర్శపాఠశాల అభివృద్ధి పనుల ప్రగతి, మంచినీటి సరఫరా, విధ్యార్థుల ఏకరూప దుస్తుల తయారీ తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి కలెక్టర్ పమేలా సత్పతి సమీక్షించారు. ఈ సంధర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలలను బడిబాట కార్యక్రమం కొరకు ముందుగానే సంసిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో 345 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు శ్రీకారం చుట్టగా కొన్ని పాఠశాలలో పనులలో నిర్వహించే పనులలో విద్యాశాఖ అధికారుల ప్రమేయం ఉండడం లేదని, పనులను పూర్తి చేయడంలో అధికారులు పూర్తి నిబద్ధతతో వ్యవహరించాలని ఆమె సూచించారు. మొదటి ప్రాధాన్యతగా మౌలిక సౌకర్యాలైన మంచినీరు, టాయిలెట్స్ మరమ్మత్తులు, విద్యుత్తు పనులను చేపట్టి సత్వరం పూర్తయ్యేలా మండల ప్రత్యేక అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. పనుల్లో ఖచ్చితమైన నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. పాఠశాల గదులు, ప్రాంగణాలు ఆక్రమణకు గురికాకుండా నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల కొరకు నిధులను సమకూర్చడం జరిగిందని, వాటిని సక్రమంగా వినియోగించి చేపట్టిన పనులు, తద్వారా వినియోగించి చేపట్టిన పనులు, తద్వారా వినియోగించిన నిధుల వివరాలను యంఈవోలు, హెచ్‌ఎంలు ధృవీకరించాలని ఆదేశించారు. అదే విధంగా పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న



వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎంత మాత్రం ఉపేక్షించనని హెచ్చరించారు. ప్రభుత్వం సంకల్పించి చేపడుతున్న పాఠశాలల అభివృద్ధి పనులను తమకు సంబంధించినవిగానే భావించాలని, అప్పుడే నిర్దేశించుకున్న విజయాన్ని సాధించగలమని పేర్కొన్నారు. పాఠశాలల్లో చేపట్టే ప్రతి పని అది ఎంత వరకు పూర్తిచేయడం జరిగింది అనే వివరాలను రికార్డులలో నమోదు చేయాలని ఆదేశించారు. పాఠశాల అభివృద్ధి కొరకు జరిగే ప్రతి పనిని తమ స్వంత పనిగా భావించి ప్రధానోపాధ్యాయులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. విధ్యార్థిని విద్యార్థులకు సంబంధించి పాఠశాలలో తీసుకున్న కొలతల ఆధారంగా ఏకరూప దుస్తుల తయారు కావాలని, వాటిని హెచ్‌ఎంలు పర్యవేక్షించాలని, దుస్తుల తయారీలో నాణ్యతను తప్పక పాటించాలని ఆయన సూచించారు. జూన్ 10 లోగా పనులు పూర్తి చేయాలని, ఈ సంధర్భంగా ఆమె అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ , డీఈవో జనార్ధన్‌రావు, ఇఇఆర్అండ్‌బి శ్రీనివాస్, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# ఆడిందే ఆట.. పాడిందే పాట ?

### జిల్లా యువజన క్రీడాశాఖలో ఇష్టారాజ్యం ?
### సిబ్బందిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం !
### అక్రమ విధులకు డీవైఎస్‌వో అండదండలు !

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** జిల్లా యువజన క్రీడాశాఖలో ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా అక్రమ వ్యవహారాలు అద్దం పడుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఫలితంగా సిబ్బంది అక్రమ విధులు, అక్రమ కార్యకలాపాలు, పని ఒక చోట జీతం మరో చోట, అసలు పనిచేయని వ్యక్తికి జీతాలు, సమయపాలన లేకుండా విధులు వంటివి జిల్లా యువజన క్రీడాశాఖలో ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. అందుకు డీవైఎస్‌వో అండదండలు దండిగా ఉండడంతో చూసీ చూడనట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వపరంగా వస్తున్న నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్నా పట్టింపులేదు. అటెండ్లరు, ఇతర సిబ్బంది దీన్ని అలుసుగా తీసుకుని అక్రమాలకు పాల్పడుతుండగా అధికారులు వారికి సహకరిస్తుండడం అనుమానాలకు తావిస్తుంది. అధికారికంగా సిబ్బంది పని చేసే చోటు ఫైళ్లలో ఒకటి ఉంటే.. పనిచేస్తున్నది వేరుగా ఉంటుంది. దీన్ని బోల్తాకొట్టించడంలో అధికారులు సిద్ధహస్తులుగా మారి అండగా నిలుస్తున్నారు. జిల్లా యువజన క్రీడాశాఖ పరిధిలో అంబేద్కర్ స్టేడియం , స్విమ్మింగ్ ఫూల్, స్పోర్ట్స్ స్కూల్ కరీంనగర్లో ఉన్నాయి. అంబేద్కర్ స్టేడియానికి , స్పోర్ట్స్ స్కూల్‌కు రాష్ట్ర యువజన క్రీడాశాఖ ప్రతి సంవత్సరం వేర్వేరుగా బడ్జెట్లను ఇస్తుంది. స్విమ్మింగ్ ఫూల్‌కు ఎండాకాలంలో వచ్చే శిక్షణ ద్వారా నిధులు వస్తున్నాయి. వాటి నిర్వహణ, సిబ్బంది వేతనాలను ఆయా నిధుల నుంచి ఇవ్వడం నిబంధన, కానీ ఇక్కడ జరుగుతుంది వేరు. అధికారులు చెబుతుంది వేరు. అంబేద్కర్ స్టేడియంలో నైట్ వాచ్‌మెన్‌గా కొన్ని సంవత్సరాలుగా పనిచేసిన రామస్వామిని ఇది వరకు డీవైఎస్‌వోగా పనిచేసి బదిలీ అయిన రాజవీరు గత సంవత్సరానికి పైగా స్పోర్ట్స్ స్కూల్‌లో నైట్ వాచ్‌మెన్‌గా చేయిస్తున్నారు. జీతం మాత్రం స్టేడియం నుంచి అందిస్తున్నారు. స్పోర్ట్స్ స్కూల్‌లో నైట్ వాచ్‌మెన్‌గా ఉండే వెంకటస్వామిని అంబేద్కర్ స్టేడియంలో కొంత కాలంగా చేయిస్తున్నారు. జీతం స్పోర్ట్ స్కూల్ డబ్బుల నుంచి ఇస్తున్నారు. కొత్తగా ఎలక్షన్స్ ముందు డీవైఎస్‌వో నియమించిన శ్రీకాంత్ రెడ్డి వచ్చిన తర్వాత సైతం అదే విధంగా జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. పై అధికారుల దృష్టికి వెళ్లకుండా అటెండెన్స్ రిజిస్టర్‌లో రామస్వామిని స్టేడియంలో , వెంకటస్వామిని స్పోర్ట్స్ స్కూల్‌లో సంతకాలు అధికారులు పెట్టిస్తున్నారు.

### విధుల్లో అక్రమాలు.. జీతాల్లో అవకతవకలు..

స్టేడియానికి అక్రమంగా వచ్చిన వెంకటస్వామి డీవైఎస్‌వోలకు తొత్తుగా మారి ఇంటి పనులు చేస్తూ మరో పక్క స్టేడియంలో ప్రైవేట్ కోచింగ్ కోచ్‌ల నుంచి నెల నెల డబ్బులు తీసుకుంటున్నారు. స్విమ్మింగ్ ఫూల్‌లో పనిచేసే సుధాకర్ డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి కి తన వ్యక్తిగత అటెండర్ మాదిరిగానే ఉంటున్నాడన్న ఆరోపణలున్నాయి. బదిలీపై పోయిన డీవైఎస్‌వో రాజవీరు ఇక్కడున్నప్పుడు తన బామ్మర్ది కొడుకు విష్ణును స్విమ్మింగ్ ఫూల్‌లో, కోచింగ్ హెల్పర్‌గా నియమించుకున్నాడు. అయితే విష్ణు విధులకు సరిగా రాకున్నప్పటికీ ప్రతి నెల జీతం చెల్లిస్తున్నారు. రాజవీరు తర్వాత కొత్తగా వచ్చిన డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి సైతం విష్ణుకు పనిచేయకున్నా జీతం ఇస్తుండడం విశేషం. కాగా అక్కడే ఉన్న సిబ్బంది విష్ణును బ్లాక్‌మెయిల్ చేస్తూ అతని జీతంలో వాటా తీసుకుంటున్నారు. స్టేడియంలోని అటెండర్ రాజ్‌కుమార్ విష్ణుకు ఫోన్ చేసి పనిచేయకున్నా జీతం వచ్చింది కదా.. స్విమ్మింగ్ ఫూల్‌లో పనిచేస్తున్న అటెండర్ అనిల్‌కు సగం జీతం ఇవ్వమని మాట్లాడారు. రూ.3వేలను అనిల్‌కు ఫోన్‌ఫే ద్వారా పంపించారు. అవన్నీ సాక్ష్యాలు డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి దృష్టికి వెళ్లినా జీతం ఇవ్వడం ఆపలేదు. సిబ్బందిపై అధికారుల అండదండలు ఏపాటివో స్పష్టమవుతోంది. స్విమ్మింగ్ ఫూల్‌లో అటెండర్‌గా చేస్తున్న అనిల్ సమ్మర్ క్యాంపుకు స్విమ్మింగ్‌కు వచ్చే వారి నుంచి ఫీజులు తీసుకుని రశీదులు, ఐడి కార్డులు ఇవ్వలేదు. డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి చెక్ చేస్తే 28 మంది డబ్బులు కోచ్‌ల ముందే అనిల్ వద్ద దొరికినప్పటికీ ఏమీ చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోయారంటే వారి మధ్య ఉన్న అక్రమ వ్యవహారం అద్దం పడుతోంది.

### డ్యూటీలోనూ మద్యం..

స్టేడియం అటెండర్ రాజ్ కుమార్ డ్యూటీకి వచ్చి 11 గంటలకు ఆఫీసుకు తాళం వేసి బార్‌లో మందుతాగుతున్నాడు. మంచిర్యాలలో నివాసముండే డీవైఎస్‌వో శ్రీకాంత్ అప్పటికే డ్యూటీకి రాలేదు. ఈ విషయాన్ని డీవైఎస్‌వోకు నేరుగా ఫోన్‌లో సమాచారమిచ్చి వీడియోలు చూపించారు. ఆగమేఘాల పై మంచిర్యాల నుంచి వచ్చిన డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి అతడిని మందలించకపోగా మెమో ఇచ్చి ఊరుకున్నాడు. తప్పు దొరికిందని మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత రాజ్ కుమార్ ఆరోసు సెలవు పెడుతున్నట్లు సెలవు పత్రాన్ని ఆయన అనుచరుల ద్వారా రిజిస్టర్‌లో పెట్టించారు. ఇలాంటి అటెండర్ రాజ్ కుమార్‌ను ఇప్పుడు స్విమ్మింగ్ ఫూల్ ఫీజులు వసూలు చేసే పనిని డీవైఎస్‌వో అప్పగించడం అంటే వారిద్దరి మధ్య ఎంతటి ఒప్పందాలున్నాయో మరి.. బదిలీపై వెళ్లిన డీవైఎస్‌వో రాజవీరుకు కరీంనగర్‌లో ప్రస్తుత డీవైఎస్‌వో శ్రీకాంత్‌కు ఆశీస్సులున్నాయి. రాజవీరు ఇప్పటికీ కరీంనగర్‌లో చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలున్నాయి. అక్రమాలు, సిబ్బంది విధుల, వేతనాలు, నిధుల ఖర్చుపై పూర్తి విచారణ జరిపి బాధ్యులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



## 10వేల ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/బుగ్గారం :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సిరవేణి సురేష్ తల్లి సిరవేణి లక్ష్మి మంగళవారం రోజు అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల సుభాష్ బుధవారం రోజున వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగ లేనందున పదివేల రూ.లు విరాళంగా అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెంటం శ్రీధర్, అడ్డగడ్డ సుభాష్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని మైనార్టీ గురుకుల బాలికల కళాశాలలో 202425 సంవత్సరానికి గాను నూతన విద్యార్థుల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కాలేజి ప్రిన్సిపాల్ సంజీదా భాను బుధవారం తెలిపారు. కళాశాలలో హెచ్ఈసి, సిఈసి కోర్సులలో చేరుటకు మైనార్టీ విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినిలు పట్టణంలోని కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన జరుగుతుందని, గత మూడు సంవత్సరాలుగా కాలేజి విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

## మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ధర్మపురి :** ఖాతాదారుడైన మృతుని కుటుంబానికి లక్ష రూ.ల చెక్కును అందజేశారు. మండలంలోని తుమ్మెనాల గ్రామానికి చెందిన ఆకుబత్తిని కొమురయ్య ధర్మపురిలోని గాయత్రీ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో నిర్భయ సేవింగ్ బ్యాంక్ ఖాతాదారునిగా ఉన్నాడు. గత 2022 నవంబర్ 22న ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో కొమురయ్య మృతి చెందాడు. ఖాతాదారుడిగా ఉన్న కొమురయ్య మృతి చెందడంతో సేవింగ్ ఖాతాపై ప్రమాద భీమా సౌకర్యం కింద లక్ష రూ.ల చెక్కును మంగళవారం బ్యాంక్ మేనేజర్ వొజ్జల మోహన్ చేతుల మీదుగా మృతుని భార్య వరలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ కనీస డిపాజిట్‌తోనే ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని, బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సన్నచిన్న రైతుల అభివృద్ధికి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు




**ప్రజాపక్షం/కొత్తపల్లి :** రైతు అభివృద్ధి చెందకుండా ఏ దేశం ఆర్థికంగా ముందుకు పోలేదని, సన్నచిన్నకారు రైతుల బాగుకై కేంద్ర ప్రభుత్వం దేశంలో పదివేల ఎఫ్‌వోలను ఏర్పాటు చేయనున్నదని బిజెపి సీనియర్ నాయకులు, కిసాన్ జాగరణ్ అధ్యక్షుడు పి.సుగుణాకర్‌రావు అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంట రైతు సంఘ భవనంలో కిసాన్ జాగరణ్ ఆద్వర్యంలో నిర్వహించిన ఎఫ్‌వోల, నిర్వాహకులు, ప్రగతిశీల రైతుల సమావేశంలో ముఖ్య అతిథిగా సుగుణాకర్ హాజరై మాట్లాడారు. దేశంలో 84 శాతం రైతులు సన్న చిన్నకారు రైతులేనని, వారి బాగుకై వారిని సంఘటిత పరిచి తమ పంటలకు విలువలను జోడించి మార్కెటింగ్ చేసుకునే సౌకర్యంతో లాభాలు పొందాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎఫ్‌వోలను విత్తన, ఫుడ్ ప్రాసెసింగ్, ఆహార ఉత్పత్తుల కంపెనీలతో అనుసంధాన పరచాలని, రైతు పెట్టుబడులైన విత్తన, ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్‌లను అమ్ముకునే కేంద్రాలకుగా , వివిధ పంటల సేకరణ కేంద్రాలుగా వాటిని ఏర్పాటు చేయాలని, అందుకే చట్టాలో తగు మార్పులు తీసుకురావాలన్నారు. రాజమండ్రి ఎఫ్‌విఎఓల మార్కెటింగ్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ హేమ, పాలమూరు సీడ్స్ ప్రతినిధి డాక్టర్ అప్పారావు, సిగ్నెట్ సీడ్స్ అధినేత డాక్టర్ సుధేశ్ శర్మ, చింతకుంట ఎఫ్‌పివోల అధ్యక్షుడు శంకరయ్యలు పాల్గొని తమ కంపెనీల గురించి వివరించారు. వివిధ అధ్యక్షులు కూతరు నరసింహారెడ్డి, కమలాకర్ రావు, పురుషోత్తం రావు, పరశురాం గౌడ్, బాపు రెడ్డి, వెంకట్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, వేణుగోపాల్‌రావు, రైతు నాయకులు దుర్గం మారుతి, ఇంద్రారెడ్డి, వెంకట్రావు, పర్శరాములు తదితరులున్నారు.

## వెల్లి విరిసిన మత సామరస్యం

### హనుమాన్ స్వాములకు భిక్ష ఏర్పాటు చేసిన ముస్లిం సోదరుడు



**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** లౌకికవాదం, మతసామరస్య పరిరక్షణలో దేశానికే మన రాష్ట్రం ఆదర్శం. మరీ ముఖ్యంగా మల్లెల్లో ముస్లింలు, హిందువులు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటారు. ఎవరికి కష్టం వచ్చినా.. ఒకరినొకరు అండగా ఉంటారు. హిందువుల పండుగల్లో ముస్లింలు, ముస్లిం ప్రార్థనల్లో హిందువులు పాల్గొంటారు. బుధవారం ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో వృత్తిరీత్యా ఆటో డ్రైవర్ మహమ్మద్ సందాని హనుమాన్ మాలదారులకు బిక్ష ఏర్పాటు చేసి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. ఈ సంధర్బంగా సందాని మాట్లాడుతూ సిరిసేడులో హిందూ ముస్లింలు సోదరభావంతో ఉంటామని, హనుమాన్ మాలదారులకు బిక్ష ఏర్పాటు చేయడం సంతృప్తిని ఇస్తుందన్నారు. పేద కుటుంబానికి చెందిన వాడనైనప్పటికీ గత ఎనిమిది సంవత్సరాలుగా హనుమాన్ మాల ధారణ స్వాములకు బిక్ష ఏర్పాటు చేస్తున్నానని, ఆంజనేయస్వామి ఆశీస్సులతో తన కుటుంబం చల్లగా ఉంటుందని ,ఆర్థికంగా ఎదుగుతూ ఆరోగ్యకరంగా ఉంటున్నామని తెలిపారు. హనుమాన్ స్వాముల సమక్షంలో శ్రీ అపర్ణ సోమేశ్వర స్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి ప్రతేక పూజలు, భజనలు చేసి అనంతరం పాఠశాల మైదానంలో సుమారు 100 హనుమాన్ భక్తులకు 5 రకాల వంటకాలు చేసి బిక్ష ఏర్పాటు చేశామని, తాను స్వయంగా బిక్ష వడ్డన చేయడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం స్వాములతో, తన పిల్లలతో కలిసి బిక్ష చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా కులమతాలకతీతంగా హనుమాన్ భక్తులకు బిక్షను ఏర్పాటు చేస్తున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ సందానిని గ్రామ ప్రజలు హనుమాన భక్తులు అభినందించారు.

## ఘనంగా నాగెల్లిపట్నం అగ్నిగుండాలు

**ప్రజాపక్షం/చొప్పదండి :** కురుమ యాదవుల ఆరాధ్య దైవం బీరప్ప దేవునికి ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి అత్యంత వైభవంగా కన్నుల పండుగ నిర్వహించుకునే బీరప్ప మహంకాళి ఉత్సవాల్లో భాగంగా బుధవారం చొప్పదండి పట్టణంలోని బీరప్ప ఆలయంలో అత్యంత వైభవంగా నాగెల్లి పట్నం ఘనంగా జరిగింది. బీరప్ప, మహంకాళి, కామారతి వేషధారణలతో కుల పెద్దలు అలరించారు. ఈ మేరకు ఈనెల 16 వ తేదీన పోచమ్మ బోనాలతో ప్రారంభమైన బీరప్ప ఉత్సవాల్లో పాలాభిషేకం, గంగాబోనం, వీరగందాలు, సుంకుపట్టుట, పెద్దబోనం, లగ్గంపట్నం, జోగు తిరుగుట, బోనాలు, నాగెల్లిపట్నం ఉత్సవాలు ఇప్పటి వరకు అత్యంత వైభవంగా కన్నుల పండుగ పెద్ద ఎత్తున కులభాంధవులు అంబరాన్ని అంటిన సంబరాలతో బీరప్ప ఉత్సవాలు జరిగాయి. వారం రోజుల పాటు ఆలయ ఆవరణలో చలువ పందులు వేయగా వివిధ వేషధారణాలతో ఒగ్గు కళాబృందం బీరప్ప కథను చెప్పడంతో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి కథను విని అలరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పర్యావరణ సమతుల్యమును కాపాడాలి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** పర్యావరణ సమతుల్యమును కాపాడడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆసిఫాబాద్ డిప్యూటి రేంజ్ అధికారి యోగేష్, రెబ్బెన ఇంచార్జ్ రేంజ్ అధికారి శ్రీధరచారి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా జిల్లా అటవీ శాఖ కార్యాలయం నుండి నిర్వహించిన బైక్ ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కొమరం భీం అంబేద్కర్ చౌక్ నుండి తిరిగి జిల్లా కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, జీవవైవిధ్య రక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం తోపాటు, అటవీ సంరక్షణలో తమతో కలిసి రావాలన్నారు. జంతువుల సంరక్షణ ఉన్నప్పుడే పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుత సంవత్సరం 48 నుండి 50 డిగ్రీల వరకు వేసవి తాపం చేరిందంటే దానికి పర్యావరణ సమతుల్యం లేకపోవడమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రేంజ్ అధికారులు సరోజ రాణి, సెక్షన్ అధికారులు సత్యనారాయణ, సతీష్, కొమ్మాల్, బీట్ అధికారులు రాజేష్, రజిత, విద్య, ఉమారాణి, స్వప్న, కిషోర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## భూసార పరీక్షలపై అవగాహన

**ప్రజాపక్షం/చిగురుమామిడి :** చిగురుమామిడి మండలంలోని నవాబుపేట గ్రామంలో రైతులకు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ వారి బి.సి.ఐ ప్రాజెక్టు ఆద్వర్యంలో గ్రామ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త యన్.రమేష్ మాట్లాడుతూ రైతులు ఈ వేసవిలో తప్పకుండా భూసార (మట్టి) పరీక్షలు చేయించుకోవాలని, వాటిలో వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకోవాలని, దీని వల్ల ఎరువుల వినియోగం అవసరమున్నంత వరకే వాడడంతో రైతులకు పెట్టుబడి తగ్గి నేల కాలుష్యం తగ్గుతుందన్నారు. లోతు దక్కులు చేసుకోవాలని, పశువుల పెంటలు, చెరువు మట్టి వేసుకోవాలని, మందలు పెట్టించుకోవాలని, పచ్చిరొట్ట ఎరువులు జీలుగ, జనుము, పిల్లిపెసర, నవధాన్యాలు చల్లుకుని పూత దశలో వాటిని కలియ దున్నుకోవడం, పత్తి, మొక్కజొన్న వ్యర్థాలను కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని తెలిపారు.

## కాంగ్రెస్ కార్యకర్తలపై కేసు నమోదు చెయ్యాలి



**ప్రజాపక్షం/చెన్నూర్ :** బిఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేయాలని చెన్నూరు నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్ బాబు అన్నారు. బుధవారం చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో దాడికి పాల్పడిన వారిపై ఫిర్యాదును అందజేసి దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిఐని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల చెన్నూర్ మండలం సుద్దాల, కంచనపల్లి గ్రామాలలో బిఆర్ఎస్ కార్యకర్తల ఇండ్లలో అక్రమంగా చొరబడి కుటుంబసభ్యుల పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి గాయపరచిన సంఘటనలో వారిపై కేసు నమోదు చేయకుండా అధికార పార్టీకి వత్తాసు గా వ్యవహరిస్తున్న పోలీసు అధికారుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడులకు పాల్పడిన వివరాలతో కూడిన ఫిర్యాదును చెన్నూరు పోలీసులకు అందించడం జరిగిందని, ఇప్పటికైన అధికారులు స్పందించి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లవేళల అండగా ఉంటామని, కార్యకర్తలకు న్యాయం చేయడానికి ఎంత దూరమైనా వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నామని, కార్యకర్తలు అధైర్య పడద్దని వారికి పార్టీ అన్ని వేళలా తోడు ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రామ్ లాల్ గిల్డ, ఎంపిపి మంత్రి బాపు, కౌన్సిలర్ రేవెల్లి మహేష్, అనిల్, అసంపెల్లి శ్రీనివాస్, మహిళ నాయకురాలు భారతి తదితరులు పాల్గొన్నారు.

## పత్రికా విలేకరిపై దాడి చేసిన దుండగులను శిక్షించాలి



**ప్రజాపక్షం/బెజ్జూర్ :** కాగజ్ నగర్ పట్టణంలో ఆదాబ్ హైదరాబాద్ పత్రిక విలేకరి అంగల తిరుపతి పై దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని కోరుతూ మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బెజ్జూర్ ఎస్ఐ విక్రమ్ సూచనల మేరకు హెడ్ కానిస్టేబుల్ శ్రీమాన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అచ్యుత్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలేకరులు వృత్తి నిర్వహణలో భాగంగా ప్రభుత్వానికి, ప్రజలకు, అధికారులకు సమస్యలను ప్రతిభించేందుకు వార్తల సేకరణ చేయడం జరుగుతుందని, వార్త సేకరణకు కావాల్సిన ఫోటోలు తీస్తున్న సమయంలో విలేకరిపై అక్రమ మట్టి రవాణా చేసే కొంత మంది దుండగులు దాడి చేయడం అమానుషం అని అన్నారు. విలేకరుల పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విలేకరులు శ్రీరామ మోహన్ చారి, శ్రీకాంత్, మహేందర్, మహేష్, నాగేష్, శ్రీనివాస్, దేవాజి, శ్రీనివాస్, తిరుపతి, దామోదర్, శ్రీనివాస్, లింగయ్య, నరేందర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష ఓట్ల మెజారిటీతో గెలవబోతున్నాం

## బిజెపి ఎంపి అభ్యర్థి గోడం నగేష్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బిజెపి లక్ష ఓట్ల మెజారిటీతో గెలవబోతున్నట్లు ఆ పార్టీ ఎంపి అభ్యర్థి గోడం నగేష్ జోష్యం చెప్పారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బిజెపి సీనియర్ నాయకుడు నాగేశ్వరరావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, కరోనా సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాలు ప్రజలకు నచ్చే మూడోసారి దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ గెలవాలని ఉద్దేశంతో ప్రజలు ఓట్లు వేశారని తెలిపారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మండుటెండలను లెక్కచేయకుండా అన్ని వర్గాల ప్రజలు బిజెపికి ఓటు వేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలను ఎన్ని ప్రలోభాలు పెట్టిన వారి మాటలకు లొంగలేదన్నారు. బిజెపి ప్రభుత్వం ఉంటేనే దేశము అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని, అదేవిధంగా ప్రపంచ దేశాలన్నీ భారతదేశం వైపే చూస్తున్నాయని దీనికి కారణం ప్రధానమంత్రి మోదీ కారణమని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన ఐదు విడతల్లో బిజెపికి 300కు పైగా సీట్లు వస్తాయని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 10కి పైగా సీట్లు వస్తాయని తెలిపారు. జడ్పిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెలా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం మోదీ ప్రభంజనం నడుస్తోందని, మూడోసారి కూడా ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ గెలుస్తారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం మొదటిసారి జిల్లా కేంద్రానికి వచ్చిన బిజెపి ఎంపి అభ్యర్థి నగేష్ కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మల్లికార్జున్, జిల్లా నాయకులు కొట్నాక విజయ్ కుమార్, కాంద్రే విశాల్, నాయకులు ప్రసాద్ గౌడ్, విలాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## బుద్ధ పౌర్ణమి ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** బుద్ద పౌర్ణమి దృష్ట్యా ప్రార్థనలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించాలని జడ్పి చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. బుద్ధ పౌర్ణమి సందర్భంగా సిర్పూర్ టి మండల కేంద్రంలోని నాగమ్మ చెరువు వద్ద గల గౌతమ బుద్ధుని విగ్రహం వద్ద ప్రార్థనల కోసం వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్ ప్రజల కోసం గౌతమ బుద్ధుని విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఏర్పాటు చేశారని, నాగమ్మ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దుడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రార్థనలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.

## సిర్పూర్ ఎస్ఐ దీకొండ రమేష్‌కు ప్రశంసపత్రం



**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో జిల్లా పోలీస్ యంత్రాంగం నిరంతర కృషి చేసిందని జిల్లా ఎస్పి కె. సురేష్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, ఉద్యోగులకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించినటువంటి ప్రత్యేక నార్కోటిక్ డ్రైవ్ చెక్ పోస్ట్ విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందున పోలీస్ శాఖ అధికారులకు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేయడం జరుగుతుంది అని తెలిపారు. చెక్ పోస్ట్ విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందున సిర్పూర్(టి) ఎస్ఐ ది కొండ రమేష్ కు ప్రశంస పత్రం అందించడం జరుగుతుందని ఎస్పి తెలిపారు. ఈ సమావేశంలో అసిఫాబాద్ డిఎస్పి సదయ్య, కాగజ్ నగర్ డిఎస్పి కరుణాకర్, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, డిసిఆర్‌బి, ఐటీ విభాగాల ఎస్ఐలు, డిపిఒ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. విధులలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రశంస అందుకున్న స్థానిక ఎస్ఐని మండల ప్రజలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రచారం



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ రూరల్ మండలంలోని చిల్యాల గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ సంవత్సరం నుంచి ఆరవ తరగతి ఇంగ్లీష్ మీడియంను ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు నరసయ్య, లక్ష్మి ప్రసాద్‌రెడ్డిలు ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాటశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వారికి వివరించారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** కాగజ్ నగర్ మండలంలోని ఈస్గాం దుర్గా నగర్ విలేజ్ నెంబర్ 9 కి చెందిన సమీరం మండల్, నారాయణ మండల్, రాంనగర్ విలేజ్ నెంబర్ 12 కు చెందిన జున్ను మండల్‌లు సెల్ ఫోన్లు పోగొట్టుకొని ఈస్ గాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సిఇఐఆర్ యాప్ ద్వారా దర్యాప్తు చేపట్టిన పోలీసులు వాటిని రికవరీ చేయడం జరిగింది. రికవరీ చేసిన సెల్ ఫోన్ లను బుధవారం ఈస్గాం ఎస్ఐ రామన్ కుమార్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఈస్గాం ఎస్ఐ రామన్ కుమార్ మాట్లాడుతూ మొబైల్ పోయిన లేదా దొంగిలించబడిన త్వరగా స్పందించి సిఇఐఆర్ పోర్టల్ నందు ఫిర్యాదు నమోదు చేస్తే మొబైల్ ట్రేస్ కావడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని అన్నారు. ఈ మొబైల్స్ ట్రేస్ చేయుటలో ప్రతిభ కనబర్చిన పోలీస్ కానిస్టేబుల్ నయీంను ఎస్ఐ రామన్ అభినందించారు.

## సోయా, కంది విత్తనాలు అందుబాటులో

**ప్రజాపక్షం/ముథోల్ :** మండల కేంద్రమైన ముథోల్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సోయా, కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్త విజయ్ కుమార్ ప్రకటలో పేర్కొన్నారు.కంది పంట విత్తనాలు ఈ నెల 24 నుండి,సోయా పంట విత్తనాలు వచ్చేనెల 1వ తేదీ నుండి అమ్మకానికి ఉంచనున్నట్లు తెలిపారు.డబ్ల్యూ,ఆర్.జి 97,టి.డి.ఆర్.జి 4 రకాలైన కంది విత్తనాలు 4 కేజీల బ్యాగు 600 రూపాయలకు గాను,6 కేజీల బ్యాగు 900 రూపాయలు,అదేవిధంగా బాసర అనే రకపు 25 కేజీల సోయా బ్యాగుల ధర 2750 రూపాయలు ఉన్నట్లు వెల్లడించారు. పైన తెలిపిన విత్తనాలు కావాల్సిన రైతులు నేరుగా వ్యవసాయ పరిశోధన కేంద్రానికి వచ్చి కొనుగోలు చేసుకోవచ్చని, దూర ప్రాంతాల రైతులు కొనుగోలు చేసుకోవాలంటే మా సంస్థ బ్యాంకు అకౌంట్ లో డబ్బులు జమ చేసినట్లయితే రైతులు తెలిపిన ప్రాంతానికి పంపిస్తామని దానికి కావాల్సిన రవాణ ఛార్జీలను అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 7337399462 నంబర్ కి సంప్రదించి తెలుసుకోవాలన్నారు.

## ఉట్నూర్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిణి కుష్బూ గుప్తా



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ రూరల్ :** ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని ఐటిడిఏ ఉద్యాన నర్సరీలను బలోపేతం చేయటంతో పాటు అభివృద్ధి చేస్తామని ఉట్నూర్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిణి కుష్బూ గుప్తా అన్నారు. బుధవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం లోని జంబుగాలో గల ఐటిడిఏ ఉద్యాన నర్సరీ, శిక్షణా కేంద్రాన్ని (హెచ్‌ఎప్‌టిసి) సందర్శించి నర్సరీలో సాగు చేస్తున్న మామిడి, నిమ్మ, జామ, సపోట పండ్ల తోటలను పరిశీలించారు. నర్సరీ ద్వారా మెరుగైన ఆదాయం పొందటం తో పాటు, గిరిజన రైతులకు, దినసరి కూలీలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టాలని, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్ కి సూచించారు. నర్సరీలో ఉన్న ఖాళీ స్థలాలను వివిధ రకాల పంటలు సాగు చేయాలని, రైతులకు ఆదాయం వచ్చే పంటలపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. నర్సరీలో పెంచుతున్న మామిడి, అలంకరణ మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమళ్ళ సందీప్ కుమార్, ఉద్యాన అధికారి సుధీర్ కుమార్, సిబ్బంది సాయి రాజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో ఆమ్‌ఆద్మీపార్టీ గెలుపుకు ప్రచారం..



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఢిల్లీలోని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో అన్ని పార్లమెంట్ స్థానాల్లోనూ ప్రచారం.ఆమ్ ఆద్మీ పార్టీ నిర్మల్ జిల్లా కన్వీనర్ సయ్యద్ పార్టీ ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం జరిగింది అని అన్నారు.పార్టీ గెలుపు కోసం రాత్రి పగలు పగలు కష్టపడుతు,బడుగు బలహీన పేద ప్రజల జీవితాలు వెలుగు రావాలంటే బిజెపిని ఓడించాలి ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఢిల్లీలో ఎక్కడ చూసినా ప్రజలు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ క్రేజీవల్ వైపు ఉన్నారు అని అన్నారు.బిజెపి ఎన్ని అడ్డకలు సృష్టించిన గెలుపుని మాత్రం ఆపలేరు అన్నారు.గత ఎన్నికల ప్రచారంలో బిజెపి మేనిఫెస్టోలో ఎన్ని పథకాలు అమలు చేశారు. అని ప్రశ్నించారు. ఇంతమందికి న్యాయం చేశారు అని ప్రశ్నించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ పంజాబ రాష్ట్రాలలో సంక్షేమ పథకాలు అట్టడ్ వర్గాలకు అందుతున్నాయని అన్నారు. బిజెపి మాత్రం ఆదని, అంబానీ కోసం పరిపాలన కొనసాగిస్తున్నారు. అనీ మండిపడ్డారు.

## ద్విచక్ర వాహనం, కారుఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ రూరల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామ సమీపంలో నిర్మల్ ఖానాపూర్ జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనం,కారు ప్రమాదవశాత్తు ఢీ కొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.మరి కొంతమంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అతివేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో దాని పైన ఉన్న ఇద్దరూ తీవ్ర గాయాలపాలైన వరిని స్థానికంగా ఉన్నవారు ప్రమాద విషయాన్ని 108 సిబ్బందికి హుటహుటిన సమాచారం ఇచ్చారు. ఆలస్యం కావడంతో స్థానికంగా 108 సిబ్బంది తీరుపై ఆందోళన చేశారు. క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిర్మల్ రూరల్ పోలీసులు ఈ మేరకు సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డు ప్రమాదం సంఘటన స్థలానికి చేరు జరిగిన తీరుతెన్నులను అడిగి తెలుసుకుంతటున్నారు. ఏది ఏమైనా రోడ్డు ప్రమాదం మాత్రం సినిమా షూటింగ్ తరహాలో అతివేగంగా కారు రోడ్డు డివైడర్లను ఢీకొని నేరుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నిర్మల్ జిల్లా రత్నాపూర్ కాండ్లీ గ్రామ వాసులకు కారు అతివేగంగా రావడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

## అపోహలు విడండి రక్త దానం చేయండి



**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** జిల్లా కేంద్రంలో స్థానిక బాగులవాడ కు చెందిన రావుల నర్సవ్వ అనే మహిళ కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మహిళ కు అత్యవసర నిమిత్తం రక్తం అవసరం పడగా తన కుమారుడు రావుల జగన్ రక్తం దానం చేసి మనసు చాటాడు సదరు వ్యక్తి తన బంధువు అయినటువంటి లక్కకుల సురేష్ లు రక్తాన్ని ఇచ్చి మానవతాను చాటారు. తన మిత్రుడు అడప నవీన్ కుమార్ ఎవరికీ ఏ ఆపద వచ్చిన నేనున్న అంటు ఎందరికో రక్తదానం చేయించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు సదరు వ్యక్తి కి కుటుంబ సభ్యులు మిత్రులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ అడప నవీన్,నరేష్,సాయిరాం లు పాల్గొన్నారు.

## పట్టుబడిన 70 కిలోల నకిలీ పత్తి విత్తనాలు




**ప్రజాపక్షం/చింతలమానేపల్లి :** కొమురంభీం జిల్లా చింతలమానేపల్లి మండలం లోని గూడెం గ్రామంలో రూ. 1. 50లక్షల విలువ గల 70 కిలోల నకిలీ విత్తనాలను బుధవారం టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ సిఐ రాణా ప్రతాప్ మాట్లాడుతూ తమకు అందిన పక్కా సమాచారం మేరకు గ్రామంలో తనిఖీలు చేపట్టామన్నారు. బైక్ లపై నలుగురు వ్యక్తులు మహారాష్ట్ర కు నకిలీ విత్తనాలను తరలిస్తుండగా పట్టుకోబోగా ముగ్గురు పారిపోయారని, ఒకరిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పట్టుబడిన నింధితున్ని విచారించి అతను తెలిపిన వివరాల ప్రకారం నలుగురిపై చింతలమానపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందని, 70 కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకొని వాటిని సీజ్ చేశామని తెలిపారు. పట్టుబడిన విత్తనాల విలువ రూ1,50,000లు ఉంటుందని పేర్కొన్నారు. అమాయక రైతులను మోసం చేసే వారిని, జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు అమ్మేవారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో టాస్క్ ఫోర్స్ ఎస్ఐ వెంకటేష్, కానిస్టేబుల్ వి. మధు, పి. రమేష్, సంజీవ్ లు పాల్గొన్నారు.

## రైతులకు జీలుగు విత్తనాల పంపిణీ

**ప్రజాపక్షం/దిలావర్పూర్ :** మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార బ్యాంకు అవరణలో బుధవారం రోజున మండల వ్యవసాయ అధికారి స్రవంతి ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రాయితీపై జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని.30 కేజీల బస్తా ధర 1116 అని,రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈవోలు,శ్రీవాణి,లక్ష్మి ,శ్రీదేవీ,సొసైటీ సీఈఓ సుకుమార్,రైతులు నరసయ్య, నర్సవ్వ తదితులు ఉన్నారు.

# నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు

జిల్లా ఎస్‌పి సురేష్ కుమార్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తే చట్టరపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి కె. సురేష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమాయక రైతులను మోసం చేస్తూ అక్రమార్గనే ధ్యేయంగా కొంత మంది అక్రమార్కులు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారని, కొన్ని కంపెనీలు కాలం చెల్లిన విత్తనాలను రీసైక్లింగ్ చేసి కొత్త విత్తనాలు అని చెప్పి రైతులకు అమ్ముడం ద్వారా సరైన దిగుబడి రాక రైతులు పెద్ద సంఖ్యలో నష్టపోతున్నారని తెలిపారు. రైతులు నకిలీ విత్తనాల ముఠాల బారిన పడకుండా జిల్లా వ్యాప్తంగా వ్యవసాయాధికారులతో కలిసి సమన్వయం పాటిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని విత్తన దుకాణాలలో తనిఖీలు చేపట్టే విధంగా పోలీసు అధికారులకు ఆదేశాలను జారీ చేశామని అన్నారు. రైతులకు మేలు రకం విత్తనాలను విక్రయించాలని, కల్తీ విత్తనాలను సరఫరా చేసే వారిపై ఉక్కు పాదం మోపాలని రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా అధికారులు అప్రమత్తతో సమాచారాన్ని సేకరించి కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. వానాకాలం సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో నకిలీ విత్తనాలను విక్రయించేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిని అరికట్టడంలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని విత్తనాలు దుకాణాల యజమానులకు పలు సూచనలు చేయడం జరుగుతుందన్నారు. లైసెన్స్ లు లేకుండా దుకాణాలను నడిపినా, రికార్డులను సరైన పద్ధతిలో మెయింటైన్ చేయకపోయినా, నకిలీ విత్తనాలను విక్రయించినా యజమానులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల నుంచి విత్తనాలను వినియోగించేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రైతులకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నకిలీ విత్తనాలు ఇతర ప్రాంతాల నుండి జిల్లాకు రవాణా కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

## ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** మొదటి అంతస్తు నుండి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర రాష్ట్రం నుండి దగుడు ముఖదే(60) బతుకు దెరువు కోసం ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామానికి వచ్చాడు. గ్రామంలోని కుమ్మరి సంఘంలో నివాసం ఉంటున్నాడు. రోజూ లాగే కూలీ పనికి వెళ్లి, భోజనం తరువాత మొదటి అంతస్థులో పడుకున్నాడు. అర్ధరాత్రి అందాజ 12.30గంటలకు లేచి, నిద్రమత్తులో మొదటి అంతస్తు నుండి జారి కింద పడగా, తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కొడుకు రాంజీ ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి సిఐ నవీన్ కుమార్ సందర్శించారు.

## దేవాలయాలను ప్రభుత్వపరంగా అభివృద్ధి చేస్తాం

**ప్రజాపక్షం/పెగడపల్లి :** దేవాలయాలను ప్రభుత్వ పరంగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి, నంచర్ల గ్రామాల్లో నిర్వహిస్తున్న బీరయ్య స్వామి వారి పట్నాల మహోత్సవంలో భాగంగా బుధవారం నిర్వహించిన బీరయ్య స్వామి వారి కళ్యాణోత్సవంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆటపాటలతో బీరయ్య స్వామి కళ్యాణాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఒరుగుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చాట్ల విజయభాస్కర్, ఉపాధ్యక్షులు సంధి మల్లారెడ్డి, మద్దులపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు సురకంటి సత్తిరెడ్డి, బోడపట్ల బీరయ్య, అరికట్ల సంజీవ్, వెల్మ బలరాంరెడ్డి, కదారి తిరుపతి, ఎల్ల శ్యాంసుందర్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, పూసాల తిరుపతి, చెట్ల కిషన్, కుంచె రాజేందర్, పవన్ రెడ్డి, కార్యకర్తలు తదితరులున్నారు.

## కరాటే పోటీల్లో జమ్మికుంట విధ్యార్థులకు పతకాలు



**ప్రజాపక్షం/జమ్మికుంట :** ఈ నెల 19న గోవాలోని మనోహర్ పారికర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీలలో జమ్మికుంటకు చెందిన విద్యార్థులు ఎండి లిబాన్ బ్రౌన్ బెల్ట్ అండర్ 14 విభాగంలో టీం కటాస్‌లో బంగారు పతకం, స్పారింగ్ విభాగంలో కాంస్య పతకం , కటాస్‌లో రజత పతకం సాధించారు. జి.దరణీష్ పర్పుల్ బెల్ట్ విభాగంలో అండర్ 14లో టీమ్ కటాస్‌లో బంగారు పతకం, కటాస్‌లో కాంస్య పతకం, జి.కార్తీక్ పర్పుల్ బెల్ట్ అండర్ 10లో టీమ్ కటాస్‌లో బంగారు పతకం, కటాసులో కాంస్య పతకం సాధించారు. వీరికి సినీహీరో తల్వార్ సుమాన్ ఆధ్వర్యంలో పతకాలు అందజేశారు. జమ్మికుంటకు చెందిన విధ్యార్థులు 3 బంగారు, 1 వెండి, 3 రజత పతకాలు సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. కరాటే మాస్టర్ యండి మహమూద్‌ను ప్రశంసిస్తూ టీం చాంపియన్ ట్రోఫీని అందజేశారు. నాలుగు దేశాల నుంచి మాస్టర్స్, స్టూడెంట్స్ సుమారు 1500 మంది పాల్గొన్నారు.

## అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** జిల్లాలో అక్రమంగా ఇసుక, ఇతర గనుల మైనింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అక్రమ మైనింగ్ ను అరికట్టేందుకు గట్టి నిఘా పెట్టి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, ఇతర గనుల నుండి అక్రమంగా తరలించడం చట్ట ప్రకారం నేరమని, రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, మైనింగ్, నీటిపారుదల, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అక్రమ మైనింగ్ నివారణకు కృషి చేయాలని అన్నారు. మానేరు నది వద్ద ఇసుక మైనింగ్ కు జిల్లాలో ప్రస్తుతం ఎటువంటి అనుమతి లేదని, మానేరు నది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మానేరు నది పరివాహకం వద్ద ఇసుక మైనింగ్ పట్ల ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని అప్పటి వరకు అక్కడి నుంచి ఇసుక తీసుకువెళ్లడానికి వీలు లేదని కలెక్టర్ తెలిపారు.అక్రమ మైనింగ్, ఇసుక రవాణా చేసే వాహనాల యజమానులు, డ్రైవర్లు, ఇతర సిబ్బందిపై కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో అక్రమ మైనింగ్, ఇసుక రవాణా పట్ల ప్రజలు సెల్ నెంబర్ 7995070699 కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, వెంటనే అక్రమ మైనింగ్ ఇసుక తరలింపు నిలిపివేసేలా చర్యలు తీసుకుంటూ, అక్రమాలకు పాల్పడుతున్న వారిని చట్టప్రకారం శిక్షించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లాలో శుక్రవారం అనగా 24వ తేదీ నుండి జరగబోయే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో మొత్తం 16 సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు, రామగుండం పరిధిలో 4, పెద్దపల్లి పరిధిలో 4, మంథని పరిధిలో 2, సుల్తానాబాద్ పరిధిలో 2, శ్రీరాంపూర్, ధర్మారం, జూలపల్లి, ముత్తారం పరిధిలో ఒక్కొక్క పరీక్షా కేంద్రం చొప్పున ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం విద్యార్థులు సుమారు 3196, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 2314 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు, రెండవ సంవత్సర విద్యార్థులకు సాయంత్రం 230 నుండి 530 వరకు పరీక్షలు ఉంటాయని, ప్రతి పరీక్షా కేంద్రానికి నియమించిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్ మెంటల్ ఆఫీసర్ లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరా, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్ సౌకర్యం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఒక జిల్లా పరీక్షల కమిటీ, రెండు సెట్టింగ్స్ స్క్వాడ్స్, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసి, ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసుకునే విధంగా అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్లో దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** 2024/25 విద్యా సంవత్సర మునకు గిరిజన బాలబాలికలకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ లో ప్రవేశించుటకుగాను 20 సీటు మంజూరు కావడం జరిగిందని డిటిడిఓ తెలిపారు.వారు మాట్లాడుతూ 3వ తరగతిలో ప్రవేశం కోరేవారికి (10) సీట్లు,5వతరగతి(5)సీట్లు,8వ తరగతిలో ప్రవేశం కొరకు(5)సీట్లు కేటాయించడం జరిగిందని,గిరిజన తెగకు చెందిన గోండ్,కోలాం,న్యాకపోడ్,లంబాడ,ఎరుకలు మొదలగునవి కూలాలకు చెందిన గిరిజన విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.దరఖాస్తు ఫారములు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం(సూకలెక్టరెట్) నిర్మల్ లో ఉచితముగా దరఖాస్తులను ఇవ్వడం జరుగుతుందన్నారు.06.06.2024లోగ కర్యాలయంలో సమర్పించాలని స్పష్టం చేశారు.దరఖాస్తుతో పాటు మీ సేవలో తీసిన కు ధృవీకరణ పత్రము,ఆదియ ధ్రువీకరణ పత్రం,ఆధార్ కార్డు రేషన్ కార్డు,ప్రస్తుతం చదువుతున్న పాఠశాలల నుండి పొందిన బోనఫైడ్ సర్టిఫికెట్,రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు గజిటెడ్ అధికారి సంతకం సంవత్సరం మొత్తం ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి 1,50,000/,పట్టణ ప్రాంతాల వారికి 2,00,000/ లక్షల ఆదాయం కలవారు అర్హులు కావున గిరిజన విద్యార్థిని విద్యార్థులు అర్హులైన వారు ఈ అవకాశను సద్వినియోగము చేసుకోగలరని కోరడమైనది ఒక కుటుంబం నుండి ఒక బాలుడు, కుమార్తమే ఎంపికకు అర్హులు ఈ నిబంధనలు పి.టి.జి కుటుంబాల బాలబాలికలకు,ఇతర బాలికలకు వర్తించదని తెలిపారు.

## మట్టి తరలిస్తున్న టిప్పర్లు సీజ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలోని ఇటుక బట్టీలకు అక్రమంగా చెరువు మట్టిని తరలిస్తున్న 8 టిప్పర్లను సీజ్ చేసినట్టు పెద్దపల్లి తహసిల్దార్ రాజకుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే రామగుండం మండలం అల్లూరు చెరువు నుండి ఎలాంటి అనుమతులు గానీ, వే బిల్లులు లేకుండా మట్టిని తలవిస్తున్నారనే సమాచారం మేరకు ,పెద్దపల్లి ఆర్డీవో ఆదేశాల మేరకు 8 టిప్పర్లలో తరలిస్తున్న మట్టిని స్వాధీనం చేసుకొని ఎమ్మార్వో కార్యాలయం తరలించామని, తదుపరి విచారణ నిమిత్తం టిప్పర్లను ఎమ్మార్వో కార్యాలయంలో ఉంచామని తెలిపారు.ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తలలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి ఆర్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో మున్సిపల్ కమిషనర్, బిల్ కలెక్టర్



**ప్రజాపక్షం/బైంసా :** లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో మున్సిపల్ కమిషనర్,బిల్ కలెక్టర్ లు చిక్కిన సంఘటన బుధవారం నిర్మల్ జిల్లాలో జరిగింది.వివరాల్లోకి వెళితే బైంసా పట్టణానికి చెందిన సదరు బాధితుడు రెండు సంవత్సరాల క్రితం ఇంటి నిర్మాణం చేపట్టగా ఇంటి నిర్మాణం నియమ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడం జరిగిందంటూ నోటీసులు జారీ చేశారు.నోటీసులు అందుకున్న బాధితుడు మున్సిపల్ కార్యాలయానికి వెళ్ళగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఇంటి పర్మిషన్ కొరకు డబ్బులను డిమాండ్ చేశారు.కాగా బాధితుడు నెలరోజుల క్రితం ఇంటి పన్నును చెల్లించ దానికి కార్యాలయానికి వెళ్ళగా ఆ సమయంలో సైతం మున్సిపల్ కమిషనర్ 30,000 ఇవ్వాలంటూ బెదిరింపులకు గురి చేయగా బాధితుడు ఏసీబీకి సమాచారాన్ని అందించారు.సమాచారం అందుకున్న ఏసీబీ బుధవారం డి.ఎస్.పి రమణ ముర్తి బాధితుడి ద్వారా మున్సిపల్ కమిషనర్,బిల్ కలెక్టర్ లకు 30,000 పంపించి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.అనంతరం మున్సిపల్ కమిషనర్,బిల్ కలెక్టర్లను కరీంనగర్ డిసిబి కార్యాలయానికి తరలించారు.

## అక్రమాలకు పాల్పడ్డ అధికారులకు తగిన శిక్షలు అవసరం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా నిర్మల్,బైంసా పురపాలక సంఘాలలో 2022 లో పారశుద్ధ్య కార్మికులు, ఇతర సిబ్బంది నియామకాల కోసం చేపట్టిన అధికారిక ఉత్తర్వుల ఆధారిత నియామకాలలో జరిగిన అవకతవకలపై పూర్తి స్థాయి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని పలువురు వారితో నిరుద్యోగులు బుధవారం సాయంత్రం నిర్మల్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రంలో పేర్కొన్నారు.అధికారిక నియమ నిబంధనలు చట్టాల ఆధారిత ధ్రువపత్రాలను స్వీకరించిన అనంతరమే ఉద్యోగాల నియామకాలు చేపట్టవలసిన సంబంధిత అధికారులు ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై అక్రమ మార్గాల ద్వారా ఉద్యోగాల భర్తీకి పూనుకోవడం జరిగిందని ఆరోపించారు.44 ఉద్యోగాల ప్రతి చేపట్టాల్సి ఉండగా అర్హులైన వారిని విస్మరించి అనర్హులైన వారికి కట్టబెట్టిందుకు చేసిన ప్రయత్నాలను ఆధారాలకు సహా గుర్తించి సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు న్యాయస్థానాలను ఆశ్రయించడం జరిగిందని వాపోయారు.ఈ కేసును సుమారు రెండు సంవత్సరాల పాటు పూర్తిస్థాయిలో విచారణ న్యాయస్థానం సంబంధించిన పురపాలక శాఖ ఉన్నత స్థాయి అధికారులు ఇందులో పాత్రధారులు,సూత్రధారులైన సంబంధిత అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ విషయంలో తగిన విధంగా పునర్ విచారణ జరిపి అర్హులైన నిరుద్యోగులకు అవకాశాలు కల్పించేలా కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయా



**ప్రజాపక్షం/ రామగిరి :** రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడునల్లవెల్లి శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమవేశాంలోమాట్లాడుతూఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలు చెల్లించకపోవడం తో ప్రవేట్ విద్యా సంస్థ యజమానులు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఫీజు రియంబర్స్మెంట్ సంబంధించిన 7000 కోట్ల బకాయిలు ఉన్నాయని గతంలో రెండు వేల కోట్లు టోకెన్లు జారీ చేసిన నిధులు విడుదల చేయలేదని కాంట్రాక్టర్లకు మాత్రంబిల్లులు చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు మాత్రం ఫీజు రియంబర్స్మెంట్ బగాయిలు ఇవ్వడం లేదని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే పేద విద్యార్థులను ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను చెల్లించి ఆదుకోవాలని కోరారు.

## చెత్త ట్రాక్టర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

**ప్రజాపక్షం/మంథని :** మంథని మున్సిపల్‌లో సేకరించిన చెత్తను వెళ్లిన ట్రాక్టర్ రచ్చపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. మంథని మండలం రచ్చపల్లి ఆర్‌అండ్‌ఆర్‌కాలనీకి దోబీఘాట్, చెరువు కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలంలో ఎలాంటి సమాచారం లేకుండా మంథని మున్సిపాలిటీ నుంచి సేకరించిన చెత్తను వేస్తున్నారని గ్రామ మాజీ సర్పంచ్ కనవేన శ్రీనివాస్ తెలిపారు. ప్రజలు నివసించే ప్రాంతానికి అతి సమీపంలో చెత్తను డంప్ చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. గ్రామస్తులకు కానీ ప్రత్యేక అధికారి, గ్రామ కార్యదర్శికి ఎలాంటి సమాచారం లేకుండా తమ పరిధిలోని ఖాళీ స్థలంలో చెత్త వేస్తున్నారని, చెత్తను డంప్ చేయడం ద్వారా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, ఉన్నతాధికారులు ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## అంతర్జాతీయ అవార్డు గ్రహీతకు మహామయూర పురస్కారం...

**ప్రజాపక్షం/మంథని :** అంతర్జాతీయ అవార్డు అందుకున్న మంథనికి చెందిన ఎండీ ఖాజా మొయినొద్దీన్ మహామయూర ప్రతిభా పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ మౌలాలిలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఇన్స్టిట్యూట్‌లో ఏఎన్ఎస్ 24 టీవీ, ప్రముఖ త్రీడీ ఆర్టిస్టు సింగరాపు శివరామకృష్ణ ఎస్ఎస్ఆర్‌కే అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన మహామయూర ప్రతిభా పురస్కార్‌కు మంథనికి చెందిన ఖాజా మొయినొద్దీన్ ఎంపికయ్యారు. కరోనా తాండవం చేస్తున్న సమయంలో దేశ వ్యాప్తంగా లైవ్‌వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్న ఖాజా మొయినొద్దీన్ మాతృబాష ఉర్దూ అయినా తెలుగులో నిర్విరామంగా 188నిమిషాలు అనర్గళంగా ప్రసంగించారని ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు కొనియాడారు. అనంతరం ప్రముఖుల చేతుల మీదుగా ఎండీ ఖాజామొయినొద్దీన్‌కు మహా మయూర పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డా,వేలు ఆనందచారీ,తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ అధినేత డా.చింతపట్ల వెంకటచారీ, మల్కాజ్‌గిరి జడ్జి డా.బురుగుల మధుసుధన్,పరేడి కామెడీ ఫేమ్ సింగర్ డా.గురుస్వామి,స్టార్ మా సూపర్ సింగర్ వెంకటేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించిలి...



**ప్రజాపక్షం/ రామగిరి :** తెలంగాణ వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులు చేసి నేటికీ బిల్లులు అందక నానా ఇబ్బందులు పడుతున్న సర్పంచుల పెండింగ్ బిల్లులను చెల్లించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని సర్పంచుల సంఘం డిమాండ్ చేస్తూ బుధవారం హైదరాబాదులోఎన్నికల కమిష నర్ కు వినతిపత్రం అందజేశారు. గ్రామాలలో అభివృద్ధి అనే ఆకాంక్షతో వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు, వీధిలైట్ల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, క్రీడా ప్రాంగణాలు మొదలగు అనేక కార్యక్రమాలు విడతల వారీగా చేపట్టి ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దడంలో సర్పంచుల పాత్ర కీలకమని తెలంగాణ సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి అన్నారు.ఎంతో కష్టపడి గ్రామాలను అభివృద్ధి పదంలో తీసుకెళ్లిన సర్పంచుల బిల్లుల చెల్లింపులలో గత మరియు తాజా ప్రభుత్వాలు జాప్యం వహించి సర్పంచులను ఇబ్బందులకుగురిచేస్తున్నాయని తెలిపారు. పెండింగ్ బిల్లుల విషయమై ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు అందించిన కాగితానికే పరిమితమయ్యాయని అన్నారు. ఈమేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దగ్గర పడుతున్న నేపథ్యంలో సర్పంచుల యొక్క పెండింగ్ బిల్లులు విడుదల చేసిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ఎన్నికల సంఘం కమిషనరు పార్థసారథికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రనిల్ చందర్, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, సముద్రాల రమేష్, పంబ కరుణాకర్, రామకృష్ణ,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అంబలి పంపిణికి పది వేలు విరాళం




సాన రామ కృష్ణ రెడ్డి

**ప్రజాపక్షం/రామగిరి :** ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో కమాన్పూర్ మండల కేంద్రంలోప్రతీ సంవత్సరం లాగే ఈసారి కూడాగత 2 నెలలుగా నిర్వహిస్తున్న అంబలి కేంద్రాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షులు రామకృష్ణ రెడ్డి బుధవారంసందర్శించి అంబలి పంపిణీచేసి,పదివేలరూపాయలఆర్థికసాయంఅందజేశారు.ఇలాంటి సామజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న యువసేన సభ్యులనను అభినందించి ప్రతీ సంవత్సరం ఇలా వేసవి కాలం లో చలివేంద్రం తో పాటు, అంబలి పంపిణికి తన వంతుగా ఈ యొక్క మంచి పనికి ప్రస్తుతం 10 వేలు రూపాయలు ఆర్థిక సహాయంఅందించడంజరిగిందని అన్నారు. సమాజం లో తన వంతు భాధ్యత గా ఎన్నో సేవా కార్యక్రమలూ చేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణ రెడ్డి ఈ యొక్క కార్యక్రమనికి పది వేలు రూపాయలు అందించినందుకు ఛత్రపతి శివాజీ యువసేన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. తర్వాత వారికి యువసేన శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో చత్రపతి శివాజీ యువసేన వ్యవస్థాపకులు జంగపల్లి శ్రీనివాస్, అధ్యక్షులు జంగపల్లి సతీష్, నాయకులు మోర ప్రశాంత్, చందు, బీజేపీ నాయకులు మచ్చగిరి రాము, బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షులు నల్లవెల్లి శంకర్, మరియు అధిక సంఖ్య లో ప్రజలు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి




**ప్రజాపక్షం/రామగిరి :** ఉద్యోగుల పర్సనల్ ఫైల్, ఫోటోల డిజిటలేషన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని డైరెక్టర్ ఆపరేషన్స్ & పాఎన్.వి.కే. శ్రీనివాస్ అన్నారు.బుధవార ముజి.ఎం.కార్యాలయంనందు పర్సనల్, ఎస్టేట్స్, వివిధ గనుల, విభాగాలసంక్షేమ అధికారులతోనిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏరియాలోపనిచేస్తున్న ఉద్యోగుల పర్సనల్ ఫైల్, ఫోటోల డిజిటలైజేషన్, క్వార్టర్స్, ఉద్యోగుల గైర్హాజరు, కోర్టు కేసులు, పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామక ఉద్యోగాల దరఖాస్తులు, టర్మినల్ బెనిఫిట్స్ తదితర అంశాలపై చర్చించారు.ఉద్యోగుల పర్సనల్ ఫైల్ మరియుఫోటోల డిజిటలైజేషన్‌ప్రక్రియను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలనిఅన్నారు.దీనికి సంబందించిసంక్షేమఅధికారులుప్రత్యేకశ్రద్ధవహించాలన్నారు అదేవిధంగా పెండింగులో ఉన్న కారుణ్య నియామక ఉద్యోగాల కేసులనువెంటనేపూర్తిచేయాలనిఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్.జీ3 ఏరియా జనరల్ మేనేజర్ శ ఎన్.సుధాకర రావు, ఎ.పి.ఎ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఎస్ఓటుజిఎంలురఘుపతి, సత్యనారాయణ, ప్రాజెక్ట్ అధికారి కె.నాగేశ్వర రావు, ఏరియా సర్వే అధికారి పి.జనార్ధన రెడ్డి, ఎస్టేట్ అధికారి కె. ఐలయ్య, డిజిఎం పర్చేస్ పి.డి.సుధాకర్, ఎం.వి.టి.సి. మేనేజర్ మల్లన్న, ఐటి డిప్యూటీ మేనేజర్ ఆర్.రాజేశ్వరి, డివైపిఎంలు వి.సునీల్ ప్రసాద్,హరీష్, సీనియర్ పి.ఓ మథిన్ హుస్సేన్, వివిధ గనుల సంక్షేమ అధికారులు బి.మురళి, ఎల్.రవిచంద్ర,సాయికృష్ణ పాల్గొన్నారు.

## పోలింగ్ అధికారులకు నెల రోజుల వేతనం గౌరవ వేతనంగా ఇవ్వాలి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారికి అసెంబ్లీ,లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహించిన సెక్టోరల్ అధికారులకు.ఆపై ఉన్నత అధికారులు ఉన్నతాధికారులకు వారి వారి ఒక నెల మూలవేతనాన్ని ఎన్నికల విధుల్లో పాల్గోన్నందుకుగాను వారికి గౌరవ వేతనంగా ఇవ్వాలని కోరుతున్నాం,అదేవిధంగా పోలింగ్ సిబ్బందికి 2 రోజుల ట్రైనింగ్,3 రోజుల పని దినంగా మొత్తం 5 రోజుల పని దినాలుగా భావించి,పోలింగ్ సిబ్బందికి గౌరవ భృతి తో పాటు ఐదు రోజుల సర్టిఫికెట్ ఇవ్వాలని పి.ఆర్.టి.యు.తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత సత్యనారాయణ,నిర్మల్ జిల్లా అధ్యక్షులు యాటకారి సాయన్న ఆధ్వర్యంలో నేడు జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది.వారు స్పందింస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిశీలించుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రాల హరిప్రసాద్,నాయకులు, వర్కింగ్ ప్రెసిడెంట్ వోడ్నాల రవిరాజ్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సోప్పర్ వార్ శంకర్, గౌరవ అధ్యక్షులు సరికొండ శ్రీనివాస్, నాయకులు ఆడే నూర్ సింగ్, మోహన్, సురేష్ తదితరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



**ప్రజాపక్షం/చందుర్తి :** షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి దాదాపు లక్ష రూపాయల విలువగల ఆస్తి నష్టం జరిగిన ఘటన మండలంలోని మల్యాల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బిటుకు లచ్చయ్య కుటుంబం వేరే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లగా బుధవారం మధ్యాహ్నం ఇంటిలో మంటలు చెలరేగడంతో ప్రమాదాన్ని గమనించిన చుట్టుపక్కల వారు మంటలు ఆర్పారు. వాషింగ్ మిషన్లో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం సంభవించి దాదాపు లక్ష రూపాయల విలువగల సామాగ్రి కాలిపోయిందని, బాధితుని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## ప్రభుత్వ కళాశాలలో చేరండి..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** రాజన్నసిరిసిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని జూనియర్ కళాశాలలో చేరాలని మెరుగైన విద్య అందుతుందని పదిలో ఉత్తీర్ణులైన వారు ఇంటర్‌మీడియట్‌లో చేరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధ్యాపకులు కోరారు.మంగళవారం రోజున బండలింగంపల్లి, గోరింట్యాల, మల్లుపల్లి, గ్రామాలలో ప్రచారం చేశారు.విశాలమైన గదులలో విద్యాభోదన చేస్తున్నామని అన్నారు.ఎన్ఎస్ఎస్ ద్వార సామాజిక సేవకులను తయారుచేయడం అనుభవం కలిగిన భోదన, ప్రభుత్వ స్కాలర్‌షిప్ అందించబడుతాయని అన్నారు. సాంస్కృతిక క్రీడల్లో ప్రోత్సహం ఇస్తున్నామని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 'సత్యనారయణ, మాదాసు చంద్రమౌళి, నీరటి విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

## కృష్ణారెడ్డికి పెరుగుతున్న ఆదారణ..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ఎల్లారెడ్డిపేట మండలంలో సింగిల్విండో చైర్మెన్ గుండారపు కృష్ణారెడ్డి ప్రజలలో మంచి సేవా దృక్పథంలో పని చేస్తున్నారు.పద్మశాలి సంఘానికి 30 వేల రూపాయల విలువచేసే కుర్చీలు అందించారు.స్థానిక సంస్థలలో తాను నిలబడితే మండలానికి సేవలు ప్రజలు అనుకున్న దానికంటే మెరుగైన సేవలు అందిస్తానని మీడియాతో మాట్లాడారు.సామాజిక సేవలలో ముందుంటానని,స్థానికంగా ప్రజా సేవకై అందుబాటులో ఉంటానన్నారు.పద్మశాలి సంఘం సింగిల్విండో చైర్మెన్ లహరికృష్ణారెడ్డి లను సన్మానించారు.

## జ్ఞాన యజ్ఞ కార్యక్రమాన్ని విజయవంతం చెయాలి



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మల్లాపూర్ గ్రామంలోని గీతా సత్సంగ్ ఆధ్వర్యంలో 77వ గీత జ్ఞాన యజ్ఞం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని గీతా సత్సంగ్ సభ్యులు కోరారు. ఈ మేరకు ఈ నెల 25వ తేదినా శనివారం నుండి జూన్ 5వ తేదినా బుధవారం వరకు మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు బుధవారం కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శివ శ్రీనివాస్, సత్యనారాయణ గౌడ్, సురేష్ రెడ్డి, శేఖర్, ఆనంద్ గౌడ్, రాకేష్, దేవయ్య, ప్రసాద్, కిషన్, లక్ష్మి రాజం తదితరులు పాల్గొన్నారు.

## రాణావేణ లక్ష్మినారాయణవినూత్న ప్రచారం



**ప్రజాపక్షం/రామగిరి :** స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల కాక ముందే రిజర్వేషన్ ఖరారుకాకముందే అప్పుడే గ్రామాల్లో స్థానిక ఎన్నికల్లో తమకు అవకాశం ఇవ్వాలంటూ అభ్యర్థిస్తు ప్రచార పర్వానికి కొందరు నాయకులు శ్రీకారంచుడుతున్నారు. పెద్దపల్లి జిల్లాకమాన్ పూర్ మండల కేంద్రానికి చెంది నరాణవేణ లక్ష్మి నారాయణ బుధవారం బాండు పేపర్ పై తనకు సర్పంచ్ గా అవకాశం కల్పిస్తే500మందినిరుద్యోగులకు గౌరవ వేతనంతో ఉద్యోగ అవకాశాలు, విద్యార్థిని విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు ప్రొఫెసర్లతో శిక్షణ కేంద్రాలు, పది రూపాయలకే టీ, టిఫిన్ తో పాటు ఆరోగ్యకరమైన ఆహారం అందించడం, గ్రామ అభివృద్ధికి ప్రజలను ఆర్థికంగా మోసం చేసిన వారికి తగిన శిక్ష పడేలా చేయుట, గ్రామంలోని వృద్ధులకు, అనాథలకు పండ్లు పాలు,ఆహారం,మందులు,అందించడం వంటి తదితర హామీల బాండ్ పేపర్ పై ముద్రించి తనను సర్పంచిగా గెలిపిస్తే తాను అమలు చేసే హామీలు ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి బాండ్ పేపర్లు అందిస్తూ వినూత్నంగా రాణవేణ లక్ష్మి నారాయణ ప్రచార నిర్వహిస్తున్నారు.